# నీలగిరి వార్త

శుభ కోసం శుభ వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com


**ట్రంప్ దిగిపోయినా ఇరాన్ యుద్ధం ఆగదా? మాజీ అధికారి సంచలన అంచనా**

- అమెరికా తర్వాతి అధ్యక్షుడికీ ఇరాన్ సమస్య తప్పకపోవచ్చని అంచనా
- ఆర్థిక ఆంక్షలు, సైనిక దాడులు కొనసాగొచ్చని మెక్‌గర్క్ వ్యాఖ్య
- దౌత్యం, సైనిక ఒత్తిడి రెండూ కొనసాగిస్తున్న అమెరికా
- అమెరికా ఎన్నికల్లో కీలక అంశంగా మారుతున్న ఇరాన్ యుద్ధం

శంషాబాద్ విమానాశ్రయంలో రూ.1.20 కోట్ల విలువైన

## బంగారం సీజ్..!

- శంషాబాద్ విమానాశ్రయంలో 800 గ్రాముల బంగారం పట్టివేత
- తిరుచ్చిరాపల్లి నుంచి వచ్చిన హైదరాబాదీ నగల వ్యాపారి అరెస్ట్

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ)లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు భారీగా బంగారం పట్టుకున్నారు. సోమవారం ఓ ప్రయాణికుడి నుంచి సోట్లు ఉంటుందని అంచనా వేశారు. పక్కా సమాచారం మేరకు డీఆర్ఐ అధికారులు ఈయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రయాణికుడిని విచారణ కోసం డీఆర్ఐ అధికారులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.


తెలంగాణ ఎడిటర్ : గుంటోజి విష్ణుమూర్తి, 06 మంగళవారం అక్టోబర్ 2026 సంపుటి : 17 సంచిక :333 పేజీలు 12 వెల : 5/-


# కీలక వ్యాఖ్యలు

- **భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్**
- **ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి**
- **ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి**
- **వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య**

భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతి ష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. **...మిగతా 2 లో...**



# రాజ్యసభ ఎన్నికలు

## కేంద్ర మంత్రులకు బీజేపీ షాక్.. అందరూ కొత్తవారే!

- **యూపీ రాజ్యసభ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ**
- **కేంద్ర మంత్రులు హర్దీప్ పురి, బీఎల్ వర్మలకు దక్కని అవకాశం**

**ఎంపీకి మళ్లీ టికెట్ ఇవ్వని అధిష్ఠానం**

- **2027 ఎన్నికల లక్ష్యంగా సామాజిక**

ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్య నిర్ణయం తీసుకుంది.

# సింగరేణి అధ్వర్యంలో ఘనంగా వేడుకలు - జీఎం రాధాకృష్ణ

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి :**

ఫ్యామిలీ డే, సద్దుల బతుకమ్మ, రామలీల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఉన్నతాధికారులు, గుర్తింపు సంఘం నాయకులతో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ ఏరియాలో ప్రతి సంవత్సరం సింగరేణి అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలన్నీ అత్యంత వైభవంగా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని చోట్ల రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణ శోభాయమానంగా ఏర్పాటు చేయాలని సూచించారు. సింగరేణి పాఠశాల మైదానంలో సద్దుల బతుకమ్మ పండుగ ఆడటానికి వచ్చే మహిళలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రామకృష్ణపూర్, మందమర్రి, సోమగూడెం, బెల్లంపల్లి అన్ని మైదానాలను ముందుగానే శుభ్రం చేసి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే రామలీల కార్యక్రమాన్ని కూడా ఎంతో ఘనంగా జరిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్.ఓ టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్, మందమర్రి ఏ.ఐ.టి.యు.సి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, దాగం మల్లేష్, అక్బర్ అలీ, డీ.జీ.ఎం పర్సనల్ సిహెచ్.అశోక్, ఏ.జీఎం ఎఫ్ అండ్ ఏ ఆర్.వి.ఎస్.ఆర్ కె.ప్రసాద్, ఏరియా రక్షణ అధికారి మురళి, డీ.జీఎం సివిల్ మదీనా భాష, ఏరియా సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర రెడ్డి, వర్క్ షాప్ ఎస్.ఈ నరేష్, సీనియర్ పి.ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.




# నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి.

## ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు.. జూదంపై కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆధ్వర్యంలో మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, ప్రజా భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, మహిళల భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వివిధ పోలీస్ స్టేషన్లలో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల పురోగతిని ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లాంగ్ పెండింగ్, మిస్సింగ్ కేసుల ఛేదనతో పాటు ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్‌కు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలని అన్నారు. నిజమైన దోషులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలో అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి, అవసరమైన చోట ప్రమాద సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా



ఉన్న ప్రధాన రహదారులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న గ్రామాల్లో ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్థిక, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ గారు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనుమానాస్పద లావాదేవీలు, మోసాలపై ప్రజలకు తగిన సూచనలు అందించాలని తెలిపారు. జూదం నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా జూదం నిర్వహిస్తున్నట్లు లేదా ఆడుతున్నట్లు గుర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జూదం వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నాయని, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే జూదాన్ని అరికట్టేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. మహిళలపై వేధింపులను అరికట్టడంతో పాటు మహిళా చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. దుర్గా నవరాత్రుల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన మేరకు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర నిఘా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు, యువతతో పోలీస్ అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఉత్సవాలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, ప్రతి గ్రామంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతో పాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు తదితర కీలక ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు.

విధి నిర్వహణలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. పోలీస్ స్టేషన్ స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందిని గుర్తించి రివార్డులు, ప్రశంసాపత్రాల కోసం సిఫారసు చేయాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అడ్మిన్ కే. నర్సింహారెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాసరావు, గట్టుమల్లు, విజయభాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన శ్రీవాణి రాధాకృష్ణ.

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి :**

ఆయిల్ పామ్ పెంపకానికి సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. మందమర్రి ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ సోమవారం ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం రాధాకృష్ణ శ్రీవాణి దంపతులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ అధినేత డాక్టర్ బుధ ప్రకాష్ జ్యోతి ఆదేశాలతో సింగరేణి వ్యాప్తంగా వ్యవసాయం, ఉద్యానవనం, అటవీ పెంపకాలకు సంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ కే. వెంకటేశ్వర్లు, జీఎం ఎన్విరాన్మెంట్ అండ్ ఫారెస్ట్ బి. సైదులు పర్యవేక్షణలో మూతపడిన బొగ్గు గనుల ప్రాంతాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి తోట పెంపకం పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. మందమర్రి ఏరియాలోని కేకే2 నర్సరీ ప్రాంతంలో సింగరేణి అధికారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి 285 మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.ఎమ్.ఎస్.ఓ. జి.ఎల్. ప్రసాద్, శాంతిఖని ఏజెంట్ ఎస్.సంతోష్, కె.కె. గ్రూప్స్ ఏజెంట్ ఖాదిర్, కె.కె.ఓ.సి. ప్రాజెక్ట్ ఆఫీసర్ డి. రాంబాబు, బెల్లంపల్లి రీజియన్ డి.జి.ఎం హరి నారాయణ, అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు.





# శాంతి గూడెం సర్పంచ్ ను సన్మానించిన గ్రామస్తులు

**దేవరకొండ నీలగిరి వార్త**

నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన  శాంతి గూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డిని సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మాన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నూతన గ్రామపంచాయతీ కి సర్పంచ్ గా ఇందిరా భాస్కర్ రెడ్డి ఎన్నికై పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు గుర్తు చేశారు తిరిగి రెండో పర్యాయం సైతం సర్పంచిగా చింతలపూడి భాస్కర్ రెడ్డిని గెలిపించుకున్నామని పేర్కొన్నారు. ఆయన ఆకుట్నిత దీక్ష పట్టుదల ప్రజా సమస్యల పట్ల స్పందించే స్వభావం డిండి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులైన భాస్కర్ రెడ్డి తమ గ్రామ సర్పంచ్ గా కావడం తమకెంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ స్థాయికి తీసుకొచ్చింది శాంతిగూడెం ప్రజలేనని రెండు పర్యాయాలు తనకు సర్పంచ్ గా అవకాశాలు కల్పించిన ప్రజల రుణం తీర్చుకోలేనని తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు గ్రామ అభివృద్ధి కోసం తాను మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

ఈ సందర్భంగా ఉప సర్పంచ్ వార్డు సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.





# ఆల్ ఇండియా చేనేత సొసైటీ తెలంగాణ ప్రతినిధుల ఎన్నికల్లో విజయం సాధించిన కర్నాటి వజ్రమ్మ

**గట్టుప్పల్, అక్టోబరు 5 (నీలగిరి వార్త):**

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ తెలంగాణ ప్రతినిధుల ఎన్నికల్లో గట్టుప్పల్ చేనేత సహకార సంఘం అధ్యక్షురాలు కర్నాటి వజ్రమ్మ వెంకటేశం విజయం సాధించారు. తెలంగాణ నుంచి సొసైటీ ప్రతినిధిగా ఆమె ఎన్నిక కావడంతో గట్టుప్పల్ చేనేత కార్మికులు, సహకార సంఘం సభ్యుల్లో హర్షం వ్యక్తమైంది. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, చేనేత కార్మికులు ఆమెకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కర్నాటి వజ్రమ్మ వెంకటేశం మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో గెలిపించిన చేనేత సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి వినియోగిస్తానన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మగ్గం వేతనాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను సొసైటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.చేనేత కార్మికుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. చేనేత రంగం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మరిన్ని ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కల్పించేలా తనవంతు కృషి చేస్తానన్నారు. గట్టుప్పల్ చేనేత సహకార సంఘానికి మరింత గుర్తింపు తీసుకురావడంతోపాటు కార్మికుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానని వజ్రమ్మ వెంకటేశం తెలిపారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ లో అన్న ప్రసాదం పంపిణీ

**దేవరకొండ నీలగిరి వార్త**

ఆకలైన వారికి అన్నం పెట్టి ఆకలి  తీర్చాలనే ముఖ్య ఉద్దేశంతో  లయన్స్  క్లబ్ లు పనిచేస్తున్నాయని  లయన్స్ క్లబ్  ఆఫ్ దేవరకొండ ప్రెసిడెంట్ గుద్దేటి జంగయ్య అన్నారు. లయన్ ఏ డి ఈ  వస్కుల సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం దేవరకొండ పట్టణంలోని  కొత్త బస్టాండ్ లోని ప్రయాణికులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ గుద్దేటి జంగయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క లయన్ సభ్యుడు సేవా నిరతుడై సమాజం కోసం ఆర్థిక సహకారమే కాకుండా సంపూర్ణ మద్దతు సమయాన్ని వెచ్చించడం గొప్ప విషయమని అన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేటువంటి భోజనం అందించడం ద్వారా వారి ఆశీస్సులు పొందుతారని ఇలాంటి కార్యక్రమాలను తమ సంస్థ మరిన్ని  చేపడుతామని పేర్కొన్నారు. ఏడిఈ వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్లాట్ఫామ్ ఎందరినో సామాజిక సేవా కార్యక్రమాల వైపు మళ్ళిస్తుందని ఈ లయన్స్ క్లబ్లో పనిచేసిన ప్రతి లయన్ సభ్యుడు తనకు తానుగా మానవతా విలువలు సామాజిక బాధ్యత సమాజం పట్ల మెలిగే విధానం సంపూర్ణంగా అలవాటు పడతాయని ఆయన అన్నారు. ఇంత మంచి లయన్స్ క్లబ్ లో చేరడం తాను ఎంతో అదృష్టం చేసుకున్నానని పేర్కొంటూ తనకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి రవీందర్ రెడ్డి, కోశాధికారి చిలుకూరి కాశీనాథ్, జోన్ చైర్మన్ గాజుల ఉషారాణి,వనం శ్రీనివాసులు ,తిప్పర్తి రుక్మారెడ్డి, బొడ్డుపల్లి భీష్మాచారి, రాజు ,దినేష్, లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# చారిత్రక కట్టడాల పరిరక్షణే ఇంటాక్ నల్లగొండ చాప్టర్ లక్ష్యం

## వారసత్వ సంపద పరిరక్షణకు సమష్టి కృషి అవసరం

## చాప్టర్ కన్వీనర్ సముద్రాల ధనుంజయ







**నల్లగొండ నీలగిరి వార్త**

జిల్లాలోని చారిత్రక కట్టడాలు, పురావస్తు సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని ఇంటాక్నల్లగొండ జిల్లా చాప్టర్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ భవన్లో సోమవారం చాప్టర్ రెండవ సమావేశం నిర్వహించారు. సభ్యుల పరిచయంతోపాటు గుర్తింపు కార్డులు, బ్రోచర్లను అందజేశారు. కన్వీనర్ సముద్రాల ధనంజయ్య, కో–కన్వీనర్ డాక్టర్ ఆడెపు రమేష్ సంస్థ లక్ష్యాలు, జాతీయ, రాష్ట్ర, జిల్లాల స్థాయిల్లో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కన్వీనర్ సముద్రాల ధనంజయ్య మాట్లాడుతూ, 1969 నుంచి సంస్కృతి పరిరక్షణ,సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటూ, అదే స్ఫూర్తితో దేవరకొండ ఖిల్లా పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఖిల్లా రక్షణకు సంఘాన్ని ద్వారా , ప్రజాప్రతినిధులకు విన్నవించడంతో పాటు చారిత్రక విశేషాలను వీడియో రూపంలో భద్రపరిచామన్నారు. వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి పరిరక్షణకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ, నిపుణుల సూచనలు, ప్రజల భాగస్వామ్యంతో కార్యాచరణ రూపొందించామని . స్థానిక పండుగలు, కళలు, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు .కో–కన్వీనర్ డాక్టర్ ఆడెపు రమేష్ మాట్లాడుతూ, వారసత్వ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో చరిత్ర, సంస్కృతి పట్ల ఆసక్తి పెంచేందుకు నెలవారీ హెరిటేజ్ వాక్స్, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వేదకుమార్ ప్రోత్సాహంతో ఇంటాక్ జీవితకాల సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. నల్లగొండ చాప్టర్ను ఉత్తమ చాప్టర్గా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.అంబటి వెంకన్న మాట్లాడుతూ, రాచకొండ, పానగల్లు, భువనగిరి, దేవరకొండ వంటి ప్రదేశాల చారిత్రక విశేషాలను వెలికితీసి, భావితరా లకు ఒదించాలని కోరారు.ఇంటాక్ ను పరిచయం చేసి, తనను ప్రోత్సహించిన వేదకుమార్ కి ధన్యవాదాలు తెలిపారు. నల్లగొండ వైభవాన్ని ప్రతిబింబిస్తూ…“నన్ను కన్న పల్లెతల్లి, నా జిల్లా నల్లగొండవెలసినావు వైభోగంగా, నిలిచినావు గుండెల నిండా…”అనే పాటను ఆలపించారు. జగిని భీమయ్య మాట్లాడుతూ,ఇంటాక్నల్లగొండ చాప్టర్ ద్వారా వారసత్వ ప్రదేశాల పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. సంస్థలో భాగస్వామిని చేసిన వేదకుమార్, కన్వీనర్ సముద్రాల ధనంజయ్య, కో–కన్వీనర్ డాక్టర్ ఆడెపు రమేష్కు ధన్యవాదాలు తెలియజేశారు.

పల్లె సతీష్ సమావేశాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో జ్యోతిరెడ్డి, అంజన్, లింగయ్య, నవీన్కుమార్, శంకర్, లింగమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులతోపాటు చాప్టర్ సభ్యులు, వారసత్వ పరిరక్షణపై ఆసక్తి కలిగినవారు, స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి, మంత్రి జూపల్లి సమీక్ష - ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల రెవెన్యూ, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఆరా






## పెండింగ్ దరఖాస్తులు వెంటనే పరిష్కరించండి - కలెక్టర్లకు మంత్రుల ఆదేశం

**నీలగిరి వార్త**

నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో కుమురం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ కె.హరిత, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా, మంచిర్యాల జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు తమ జిల్లాల పురోగతిని వివరించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజలకు పారదర్శక పాలన అందించాలని, ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని సూచించారు .ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.ఈ సమావేశంలో శాసనమండలి సభ్యులు దండె విఠల్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వర పుత్ర యూత్ అసోసియేషన్ వినాయక మండపం చిన్న లడ్డు

## 111116 దక్కించుకున్న ముగ్గురు మిత్రులు

**దేవరకొండ నీలగిరి వార్త**

దేవరకొండ పట్టణంలోని గాంధీ నగర్ లోని ఈశ్వర పుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఇరవై ఒక్క రోజులు పూజలు అందుకున్న భారీ గణనాథుని వద్దగల చిన్న లడ్డు వేలం పాట ఆదివారం నిర్వహించారు. వేలం పాటలో అశేషంగా పాల్గొనగా పోటాపోటీగా  వేలంపాట కొనసాగించగా పట్టణానికి చెందిన ముగ్గురు మిత్రులు ఎన్ వంశీ, (సిజ్జు ) జి రిషికేష్ (లక్కీ) డి. లోకేష్ సంయుక్తంగా లడ్డు వేలంపాట ద్వారా కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ముగ్గురు మిత్రులు లడ్డున వేలం పాట ద్వారా దక్కించుకోవడం పట్ల వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వేలంపాట ద్వారా లడ్డు తగ్గించుకున్న ముగ్గురు మిత్రులకు కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం లడ్డును లడ్డును అందజేశారు లడ్డును కైవసం చేసుకున్న ముగ్గురు మిత్రులు మాట్లాడుతూ తమకు విఘ్నేశ్వరుని యొక్క ప్రసాదం వేలంపాట ద్వారా దక్కడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడలో ఘనంగా ‘షీ నీడ్స్’ 14వ శాఖ ప్రారంభోత్సవం

**నీలగిరి వార్త**

మిర్యాలగూడ పట్టణంలో ‘షీ నీడ్స్ సారీస్ ఓ రెడీమేడ్స్’ 14వ శాఖ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 4న జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీతిక నాయక్ విచ్చేసి నూతన శాఖను ప్రారంభించారు.మహిళలకు ఆకట్టుకునే విధంగా వివిధ రకాల చీరలు, రెడీమేడ్ దుస్తులు, అతిథి రీతిక నాయక్ను సంస్థ నిర్వాహకులు, సిబ్బంది ఘనంగా స్వాగతించారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని షోరూమ్ను ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమానికి స్థానికులు, మహిళలు, వస్త్రాభిమానులు హాజరయ్యారు.






## హైదరాబాదులో నెహ్రూ జంతుప్రదర్శనశాల ప్రారంభించి నేటికి 63 సంవత్సరాలు

నిలగిరి వార్త న్యూస్

నెహ్రూ జంతుప్రదర్శనశాలను హైదరాబాదులో ప్రారంభించి నేటికి 63 సంవత్సరాలు నిండాయి. నెహ్రూ జంతుప్రదర్శనశాల భారత దేశంలోని అతిపెద్ద జంతు ప్రదర్శనశాల ఇది హైదరాబాదులోని మీర్ ఆలమ్ చెరువు సమీపంలో ఉన్నది. దీనిని అక్టోబరు 6, 1963లో ప్రధానమంత్రి నెహ్రూ పేరుమీద స్థాపించారు. ఇది తెలంగాణ అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్నది.ఇది 380 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉండి, ఇంచుమించు 1,500 జాతుల జంతువులు, పక్షులు మొదలైన వాటిని రక్షిస్తున్నది. నెహ్రూ జంతుప్రదర్శనశాల 26 అక్టోబర్ 1959న శంకుస్థాపన చేయబడినది, 6 అక్టోబర్ 1963 నుంచి ప్రజల సందర్శనకు తెరవబడింది. ఈ ఉద్యానవనాన్ని తెలంగాణ ప్రభుత్వ అటవీ శాఖ నడుపుతోంది. దీనికి భారత మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరు పెట్టారు.




# కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తెలంగాణ గలాన్ని వినిపించిన వ్యక్తి కాక వెంకటస్వామి

### -ఘనంగా నివాళులర్పించిన మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిలగిరి వార్త న్యూస్

తొలి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని బుల్లెట్ గాయాల పాలయ్యాడని, మలి తెలంగాణ ఉద్యమంలో కాక వెంకటస్వామి పాత్ర ప్రత్యేకమైనదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో తెలంగాణ గలాన్ని వినిపించినటువంటి వ్యక్తి ఆయన అని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు.సోమవారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో (కాక) గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు.రాష్ట్ర ఐటి.ఈసీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టి.పి.సి.సి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబుల ఆదేశాల మేరకు కాక జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అయిలి శ్రీనివాస్, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, మాజీ ఎంపిపి కొండ శంకర్, మాజీ మార్కెట్ చైర్మన్ అజీమ్ ఖాన్ లు మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి ని గుడిసెల వెంకటస్వామి అనే వారు అని గుర్తు చేసుకున్నారు. 2014 వరకు భారత పార్లమెంటు సభ్యుడు గా, ఎమ్మెల్యేగా పనిచేశారని అన్నారు.కాకా వెంకటస్వామి ఆంధ్రప్రదేశ్ లోని పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహించి కేంద్ర మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు.నిజాం నిరంకుశ పాలన పై వ్యతిరేకంగా జరిగినటువంటి పోరాటంలో సైతం వెంకటస్వామి భాగస్వాములైనరని ఈ సందర్భంగా తెలిపారు.హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న సందర్భంలో భూస్వాముల గుండాలు పేదల గుడిసెను తొలగించి కబ్జాకు గురి చేయటానికి ప్రయత్నం చేస్తే వెంకటస్వామి నిరుపేదల తరఫున పోరాడి మళ్లీ వారందరికీ గుడిసెలు వేయించి గుడిసెల వెంకటస్వామి గా పేరు గాంచినరాని



తెలిపారు.వెంకటస్వామి యువజన కాంగ్రెస్ ద్వారా రాజకీయాలలో అరంగేయటం చేసి ఎంపీగా, ఎమ్మెల్యేగా, కేంద్రమంత్రిగా సిడబ్ల్యుసి ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా వారు పని చేశారని ఈ దేశ ప్రజలకు ఎన్నో సేవలు అందించడం జరిగిందన్నారు.కాక వెంకటస్వామి కార్మిక నాయకునిగా సింగరేణి నష్టాలలో ఉన్న సందర్భంలో కేంద్రం నుండి 400 కోట్లను తీసుకువచ్చి సింగరేణి లాభాల బాట పట్టే విధంగా వారు కృషి చేయడం జరిగిందని, కార్మికుల సంక్షేమం కోసం ప్రైవేటు కార్మికుల పింఛన్ కోసం వారు పాటుపడడం జరిగిందని, కార్మికుల పిల్లల విద్య కోసం, కార్మికుల ఐటి పన్ను రద్దు కోసం వారు కృషి చేయడం జరిగింది అని అన్నారు. ఎఫ్సీఐ పునరుద్ధరణ కోసం వారు ఏనలేని కృషి చేయడం జరిగిందని తెలిపారు. కాక వెంకటస్వామి స్వర్గీయ శ్రీపాద రావు తో కలిసి ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఈ సందర్భంగా వారు తెలిపారు.కాక వెంకటస్వామి ఆశయా సాధన కోసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,దుద్దిల్ల శ్రీను బాబు నాయకత్వంలో ఈ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో అర్ధరాత్రి వాహనాల తనిఖీలు

### -వధ కోసం అక్రమంగా తరలిస్తున్న 31పశువుల పట్టివేత,కేసు నమోదు

### -మంథని ఎస్సై ఎన్ సందీప్ కుమార్

నిలగిరి వార్త న్యూస్

డీసీఎం వ్యాన్ లో ఎలాంటి అనుమతులు లేకుండా వధ కోసం అక్రమంగా తరలిస్తున్న 31 పశువులను పట్టుకున్నట్లు మంథని ఎస్ఐ ఎన్ సందీప్ కుమార్ తెలిపారు.మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి రోడ్డుపై ఆదివారం రాత్రినుండి సోమవారం తెల్లవారుజాము వరకు మంథని ఎస్ఐ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ వాహన తనిఖీ విధులు నిర్వహిస్తున్న సందర్భంలో భూపాలపల్లి వైపు నుండి మంథని వైపు వెళ్తున్న టీఎస్ 12 యూడీ 4009 నంబరు డీసీఎం వ్యాన్‌ను పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో 22 ఆవులు, 9 ఎద్దులు కలిపి మొత్తం 31 పశు వులను ఇరుకుగా కట్టి, తగినంత స్థలం, మేత, నీరు లేకుండా రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనంలో ఉన్నవారు యాజమాన్య పత్రాలు, రవాణా అనుమతి, పశువైద్య ధృవపత్రాలు చూపలేకపోయారు. విచారణలో ఈ పశువులను వధ కోసం తరలిస్తున్నట్లు తెలిసిందని మంథని ఎస్ఐ సందీప్ కుమార్ తెలిపారు.సిద్దిపేటకు చెందిన మహమ్మద్ సద్దాం,కరీంనగర్ కు చెందిన మహమ్మద్ రిజ్వాన్ లను అదుపులోకి తీసుకున్నమన్నారు. మధ్యవర్తుల సమక్షంలో డీసీఎం వ్యాన్‌ను, పశువులను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పశువులను భట్టుపల్లిలోని కపిల గోశాలకు సురక్షితంగా అప్పగించామని మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నామని ఎస్సై సందీప్ కుమార్ తెలిపారు




# మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలి






### -విద్యార్థులకు సూచించిన మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వినయ్ నాయక్

### -మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

నిలగిరి వార్త న్యూస్:

పుట్టినరోజు వేడుకలలో, ఇతర శుభకార్యాలు జరుగుతున్నప్పుడు మొక్కలు నాటాలని, పర్యావరణ కాలుష్యం నివారించాలని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు, పరిసర ప్రజలకు అడవుల వలన కలిగే ఉపయోగాలు తెలియజేయాలని మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వినయ్ నాయక్ సూచించారు. మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మంథని అటవీ శాఖ,ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం వన్యప్రాణి సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరస్పర అవగాహన సదస్సును కూడా ఏర్పాటు చేశారు.అనంతరం మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.వినయ్ నాయక్ మాట్లాడుతూ అడవుల నిర్మూలన వలన వన్యప్రాణులకు నివాసాలు కరువై జనవాసాలలోకి వస్తున్నాయని, ఇప్పుడున్న కోతుల సమస్య అడవుల నిర్మూలన వల్లనే జరుగుతున్నదని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ సి. హెచ్. పరిషయ్య మాట్లాడుతూ చెట్లను నరకడం వల్ల ఆక్సిజన్ లోపించి భూమిమీద జీవం అంతరించే ప్రమాదం ఉందని , ఈనాడు ఎదుర్కొంటున్న ఎల్నినో లాంటి విపత్తులకు, వర్షాలు కురువక పోవడానికి అడవుల నరికివేత ఒక కారణమని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో మానవ – వన్య ప్రాణుల సహజీవనం అనే అంశంపై విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దేవదాస్, సిబ్బంది మంగిలాల్, రవి , షా ఖాన్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణ, చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, ఫర్జానా, రామకృష్ణ, రజిత, దుర్గం కృష్ణ, శేఖర్, సందీప్ మరియు

# 10వ వార్డులో ఉచిత చెస్ట్ సర్వే క్యాంప్ కు విశేష స్పందన

నిలగిరి వార్త న్యూస్:

మంథని మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో సోమవారం ఉచిత చెస్ట్ సర్వే క్యాంపు నిర్వహించారు. తమ్మచేరువు కట్ట పిల్లల పార్క్ ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రంలో ఈ క్యాంపుకు విశేష స్పందన లభించినట్లు కౌన్సిలర్లు పెంటరి రాజు, నూకల కమల్ లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన క్యాంపులో విశేష సంఖ్యల ప్రజల చెస్ట్ ఎక్స్రే టెస్టులు చేయించుకున్నారని వారు తెలిపారు. రాబోయే రోజులలో మరిన్ని ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ క్యాంపులో 110 మంది టెస్టులు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, ఎం ఎల్ హెచ్ పి లు ఆర్ శ్రావణి, జి అనూష, హెల్త్ అసిస్టెంట్ లు దామోదర్, స్వామి, హెచ్ ఈ ఓ శ్రీనివాస్, ఏఎన్ఎంలు డి రమ, ఆర్ సంధ్య, వి అనురాధ, పి రేవతి, ఏ స్వరూప రాణి, బి రాధ, ఏ ఏ ఎం పి హెచ్ సి గద్దలపల్లి లు పాల్గొన్నారు.



# మంథనిలో ఘనంగా కాక జయంతి వేడుకలు

### -బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఘన నివాళి

నిలగిరి వార్త న్యూస్

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో మంథని పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి మాజీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి దివంగత జి. వెంకట స్వామీ కాక జయంతి వేడుకలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు పట్టణంలోని జి. వెంకట స్వామి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మంథని మండల అధ్యక్షుడు ఎగోళం శంకర్ గౌడ్ మాట్లాడుతూ జి. వెంకట స్వామి కార్మిక నాయకుడిగా, పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, కార్మికుల హక్కుల పరిరక్షణకు ఆయన జీవితాంతం కృషి చేశారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాకా అని అభిమానంగా పిలుచుకునే వెంకట స్వామి తెలంగాణ ఉద్యమంలోనూ, దళిత బహుజన ఉద్యమాల్లోనూ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన ఆదర్శాలను నేటి తరం యువతకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బాలికల జూనియర్ కళాశాలలో ప్రారంభమైన మధ్యాహ్న భోజనపథకం

నిలగిరి వార్త న్యూస్:

మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని కళాశాలలో ప్రిన్సిపల్ బాలోజీ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా కళాశాలలో విద్యార్థులకు భోజనం అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. భోజనం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. గత కొద్ది రోజులుగా ఉదయం అల్పాహారం కూడా అందిస్తున్నారని ఇప్పుడు భోజనంతో విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# పేకమేడలా కూలుతున్న వైసీపీ.. పోటీకి అభ్యర్థులు కూడా ఉండరు బొడ్డు,ముప్పిడి విమర్శలు





**కొవ్వూరు నీలగిరి వార్త ప్రతినిధి**

కొవ్వూరు : కొవ్వూరు మున్సిపాలిటీ పరిధిలో వివిధ పార్టీలకు వైఎస్సార్సీపీకి చెందిన సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దిసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి మద్దిపట్ల శివరామకృష్ణ ఏఎంసీ చైర్మన్ నాదెండ్ల శ్రీరామ్ మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని నియోజకవర్గ నాయకుల సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగింది జిల్లాలోనే ఈ స్థాయిలో భారీగా చేరికలు జరగడం పట్ల పార్టీ నాయకులు నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాల్లో భాగంగా టీడీపీ జిల్లా స్థాయిలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల త్రిసభ్య కమిటీలకు చెందిన తొమ్మిది మంది ప్రతినిధులు రాజమండ్రిలో ఇప్పటికే రెండుసార్లు సమావేశమై ఎన్నికల వ్యూహాలపై చర్చించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో రిజర్వేషన్లు మరియు పోటీపై కూటమి అధినాయకత్వం తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి పనిచేస్తామని న వెల్లడించారు. కొవ్వూరు మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డుల్లోనూ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ధీమా వ్యక్తం చేశారు.. వైఎస్సార్సీపీ పార్టీరోజురోజుకూ పేకల మేడలా కూలిపోతోందని, విజయనగరం జిల్లా పరిణామాలు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఆ పార్టీలోని నిరంకుశ వైఖరి, కార్యకర్తలను పట్టించుకోకపోవడమే పతనానికి ప్రధాన కారణమని విమర్శించారు. నారా లోకేష్ "కార్యకర్తే మా అధినేత" అని గౌరవిస్తుంటే, వైఎస్సార్సీపీ మాత్రం వాలంటీర్ల వ్యవస్థను తెచ్చి సొంత నేతలను, కార్యకర్తలను పక్కనబెట్టిందని ఆరోపించారు. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు సమిష్టిగా ముందుకు సాగుతున్నాయని, స్థానిక ఎన్నికలు ఏ సమయంలో వచ్చినా కూటమి అభ్యర్థుల ఘన విజయం ఖాయమని స్పష్టం చేశారు.ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2019లో 'ఒక్క ఛాన్స్' అని కోరిన వైకాపాకు ప్రజలు అధికారం ఇస్తే, ఆ పార్టీ నాయకులు రాష్ట్రాన్ని 10-15 సంవత్సరాల కాలం వెనక్కి తీసుకువెళ్లారని 'వై నాట్ 175' అని మాట్లాడిన జగన్ మోహన్ రెడ్డికి, ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా కేవలం 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని, ప్రజలను చక్కగా పరిపాలించే పార్టీ విధానాన్నే ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని, గత పాలనలో విసిగిపోయిన ప్రజలు కూటమికి పట్టంగట్టారని తెలిపారు.ప్రస్తుతం వైకాపాలో తీవ్ర నిరాశ, భయ వాతావరణం నెలకొందని, ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి కూటమిలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పని చేస్తున్న ఎన్డీయే ప్రభుత్వ పాలనకు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని గ్రహించిన జగన్ మోహన్ రెడ్డి, ఏకగ్రీవాలు జరిగితే సీట్లు ఇవ్వబోనంటూ తమ పార్టీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు.కొవ్వూరు నియోజకవర్గంలోనూ, కొవ్వూరు పట్టణంలోనూ వైకాపాకు చెందిన కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, పోటీ చేసిన అభ్యర్థులతో పాటు సుమారు 200 మంది కూటమిలో చేరారని వెల్లడించారు. రాబోయే కొవ్వూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకపక్షంగా విజయం సాధించబోతోందని, కనీసం పోటీ చేయడానికి కూడా వైకాపాకు అభ్యర్థులు దొరకని పరిస్థితి కొవ్వూరులో ఏర్పడనుందని అని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పెద్దిబోయిన శివప్రసాద్ సూర్యదేవర రంజిత్ కుమార్ పార్లమెంటు కమిటీ సభ్యులు ఆళ్ళ హరిబాబు , కాశీ నవీన్ దాయన రామకృష్ణ , కాకర్ల సత్యేంద్ర మరపట్ల కళాధర్ చక్రవర్తి , వేమగిరి వెంకట్రావు అర్జిల్లీ రామకృష్ణ , , భావన రత్నకుమారి కొప్పాక జవహర్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# చిలకలడోన ఎంపీపీఎస్ పాఠశాల స్కావెంజర్ ను తొలగించాలనీ వినతి పత్రం అందజేసిన విద్యార్థి సంఘాల నాయకులు.

## విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతున్న ఎంపీపీఎస్ పాఠశాల స్కావెంజర్...

## పాఠశాలలో ఇంత జరుగుతున్న నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరిస్తున్న పాఠశాల హెచ్ఎం.

**మంత్రాలయం,అక్టోబర్ 5 నీలగిరి వార్త**

మంత్రాలయం మండల కేంద్రంలో ఎంఈఓ ఆఫీస్ నందుఎంఈఓ నాగభూషణంకు వినతిపత్రం అందజేసిన విద్యార్థుల సంఘ నాయకులుఈ సందర్భంగా ఆర్పిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది పిఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ లు మాట్లాడుతూపాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదని, స్కావెంజర్గా విధులు నిర్వహిస్తున్న మాణిక్యమ్మను తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వారు వాపోయారు.పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటే విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని మరియు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు.స్కావెంజర్గా మాణిక్యమ్మ కొనసాగింపుపై సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు ఎంఈఓను కోరారు. అదేవిధంగా, గతంలో పాఠశాల వ్యవహారాలకు సంబంధించి మాజీ విద్యా కమిటీ చైర్మన్తో పాటు మరికొందరిపై కేసులు నమోదైనట్లు తమకు సమాచారం ఉందని వారు పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉందని వారు తెలిపారు.పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై విద్యాశాఖ అధికారులు తక్షణమే విచారణ నిర్వహించి, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరిన్ని ఆందోళనలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.



# వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలి.

## జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేసిన డిసిసి అధ్యక్షుడు అయూబ్.

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**



వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ, వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో అర్హత కలిగిన రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా ఛైర్మన్ చిలువెరు శ్రీనివాస్, వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ కమలుద్దీన్, చాంద్ పాష తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి పోలీసుల ఆత్మీయ వీడ్కోలు

## హెడ్ కానిస్టేబుల్ దామోదర్బాబుకు ఘనంగా సత్కారం

## జ్ఞాపికను బహూకరించిన :- ఎస్సై విజయ్ సింహ రెడ్డి

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 5, నిలగిరి వార్త న్యూస్:**

అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా సుదీర్ఘకాలం పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించి, బదిలీపై ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళ్తున్న బి. దామోదర్బాబుకు తోటి సిబ్బంది అపూర్వ వీడ్కోలు పలికారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో స్టేషన్ ఎస్సై విజయ్ సింహారెడ్డి ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.?ఈ సందర్భంగా ఎస్సై విజయ్ సింహారెడ్డి మాట్లాడుతూ.. దామోదర్బాబు తన సేవా కాలంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చూపిన చొరవ, తోటి సిబ్బందితో ఆయన మమేకమైన తీరు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.?ఖమ్మంలో చేపట్టబోయే నూతన విధులు కూడా మరింత విజయవంతం కావాలని, ఆయనకు కుటుంబ సమేతంగా మంచి ఆరోగ్యం, భవిష్యత్తు లభించాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు....




# బడిబాటలో పిల్లలు

## డ్రగ్స్కు దూరంగా యువత

## "విద్యా ప్రేరణ" తో స్కూల్ డ్రాప్అవుట్ విద్యార్థులకు

**వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.**

వరంగల్ పోలీసుల అండపాఠశాల మానేసిన విద్యార్థులను తిరిగి బడిబాట పట్టించి, వారిని డ్రగ్స్, ధూమపానం ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉంచే లక్ష్యంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "విద్యా ప్రేరణ (ఎఱఎఝ ౹ాతీవతీఖఱ)" కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాదకద్రవ్యాల వినియోగంపై నిర్వహించిన విశ్లేషణలో యువతలో డ్రగ్స్కు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.వరంగల్ సబ్-డివిజన్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువు మానేసిన 42 మంది విద్యార్థులను గుర్తించారు. వారిలో 22 మంది విద్యార్థులను కౌన్సెలింగ్, తల్లిదండ్రులతో చర్చలు అవసరమైన సహాయ సహకారాలతో విజయవంతంగా తిరిగి పాఠశాలల్లో చేర్పించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు పుస్తకాలు, నోట్బుక్స్, స్టడీ మెటీరియల్ తదితర విద్యా సామాగ్రిని అందించి చదువు కొనసాగించేలా ప్రోత్సహిస్తున్నారు.విద్యార్థులను తిరిగి పాఠశాలకు చేర్పించడంతో కార్యక్రమం ముగియదని, వారి పాఠశాల హాజరు, విద్యాభ్యాసం ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన కౌన్సెలింగ్, ప్రోత్సాహం అందిస్తామని వరంగల్ పోలీసులు తెలిపారు. "ప్రతి పిల్లవాడిని బడిలో ఉంచడం -- డ్రగ్స్కు దూరంగా ఉంచడం -- వారి భవిష్యత్తును కాపాడడం" తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.






## వాసవిక్లబ్ గవర్నర్ గా గుముడవెల్లి నామినేషన్ దాఖలు .

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

వాసవిక్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ డిస్ట్రిక్ట్ వి101ఏ 2027వ సంవత్సరానికి గాను గవర్నర్ గా సోమవారం వాసవిక్లబ్ వరంగల్ నుండి గుముడవెల్లి సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. క్లబ్ అధ్యక్షులు పల్లెర్ల వీరన్న, కార్యదర్శి బొడ్ల మోహన్ తో కలిసి ఎన్నికల అధికారి దాచెపల్లి సీతారామ్ కమిటీకి పత్రాలను అందచేశారు. మధ్యాహ్నం 3గంటల వరకు సింగిల్ నామినేషన్ వాసవిక్లబ్ వరంగల్ నుండి వచ్చినట్లు ఎన్నికల అధికారి సీతారామ్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల కమిటీ సభ్యులు అంచూరి శ్రీనివాస్, దొడ్డ మోహన్ రావు, గార్లపాటి సంతోష్, మాలె యోగేశ్వర్ రావు, గంపా సాంబమూర్తి, మంచాల విజయ్ కుమార్, జిల్లాలోని వివిధ క్లబ్స్ నుండి 60 మంది సభ్యులు పాల్గొన్నారు.




## ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం .

ప్రతి పౌరుడి బాధ్యత

ఆటో క్యాబ్ వాహనాలకు "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్ ను ప్రారంబించిన.

వరంగల్ పోలీస్ కమిషనర్.

ఎన్ శ్వేత ఐపీఎస్.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

అభయ--మై ట్యాక్సీ సేఫ్" స్టిక్కర్లను ప్రతి ఆటో మరియు టాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా అంటించుకోవాలి.-- స్టిక్కర్ ను చూడగానే ప్రయాణికులకు నమ్మకం కలుగుతుంది.
మహిళలు, ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో , రూపొందించిన "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ద్వారా ప్రారంబించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రయాణికులు "అభయ--మై ట్యాక్సీ సేఫ్" స్టిక్కర్లు అంటించి ఉన్న టాక్సీ వాహణాల్లో మాత్రమే ప్రయాణిస్తారని తెలిపారు. "అభయ--మై ట్యాక్సీ సేఫ్" స్టిక్కర్లను ప్రతి ఆటో టాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా అంటించుకోవాలని, టాక్సీ పైన ఉన్న స్టిక్కర్ ను చూడగానే ప్రయాణికులకు నమ్మకం కలుగుతుందని, ఇందుకోసం ప్రతి ఆటో మరియు క్యాబ్ యజమానులు వారి టాక్సీ వివరాలను "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్ లో నమోదు చేసుకొని, సమీప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించి, స్టిక్కర్ లను పొంది, వారి టాక్సీ వాహనాలకి అంటించుకోవాలని తెలిపారు. ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా ట్యాక్సీ డ్రైవర్లకు యాప్ వినియోగం, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ట్యాక్సీ వాహనాల్లో ప్రయాణించే మహిళలు, ఇతర ప్రయాణికులు కూడా "అభయ--మై ట్యాక్సీ సేఫ్" యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్యాక్సీ వాహనాలపై ఏర్పాటు చేసిన స్టిక్కర్ల ద్వారా ప్రయాణికులకు యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలను వినియోగించుకునేలా ప్రోత్సహించనున్నారు. అలాగే నాటక ప్రదర్శన ద్వారా పోలీసు కళాబృందం వారు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, టాక్సీ డ్రైవరు లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.







# బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారమే

## కాకా వెంకటస్వామికి నిజమైన నివాళి

## కాకా ఆశయాల సాధనకు యువత రాజకీయాల్లోకి రావాలి..

## తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాజ్యాధికార పోరాటం

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు దామాల సత్యం

ఖమ్మం, నీలగిరి వార్త అక్టోబర్ 5:

కాకా వెంకటస్వామి ఆశయాలతోనే బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం యువత రాజకీయాల్లోకి రావాలి.. మహనీయుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి
తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దామాల సత్యం తెలిపారు
బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన కాకా వెంకటస్వామి ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దామాల సత్యం పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం నగరంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో కాకా వెంకటస్వామి 73వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దామాల సత్యం మాట్లాడుతూ.. కాకా వెంకటస్వామికి దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. కేంద్రంలో అనేక కీలక మంత్రి పదవులు చేపట్టి, అట్టడుగు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. పేదలకు గుడిసెలు నిర్మించి ఇచ్చిన కారణంగా ఆయనకు 'గుడిసెల వెంకటస్వామి' అనే పేరు కూడా ప్రజల్లో స్థిరపడిందన్నారు. కాకా వెంకటస్వామి వంటి మహనీయుల అడుగుజాడల్లో యువత నడవాలని, వారి ఆలోచనలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దామాల సత్యం సూచించారు. ముఖ్యంగా యువత రాజకీయాల్లోకి పెద్దఎత్తున రావాల్సిన అవసరం ఉందని, రాజకీయాలను కేవలం కొంతమంది వర్గాలకే పరిమితం చేయకుండా బడుగు, బలహీన వర్గాల యువత కూడా నాయకత్వ బాధ్యతలు చేపట్టాలని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో పాదయాత్ర



కొనసాగుతోందని దామాల సత్యం తెలిపారు. రాష్ట్రంలో అట్టడుగు వర్గాలకు రాజకీయ అధికారం దక్కే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాకా వెంకటస్వామి చూపించిన మార్గంలో నడుస్తూ సమాజంలోని అట్టడుగు వర్గాలకు న్యాయం జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. "యువత మేలుకోవాలి.. రాజకీయాల్లోకి రావాలి.. రాజ్యాన్ని ఏలే స్థాయికి ఎదగాలి" "యువత మేల్కొంటేనే బడుగులకు రాజ్యాధికారం"అని దామాల సత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు తెల్లపుట్ట,జగపతి బాబు, టౌన్ అధ్యక్షుడు కొప్పుల రామారావు, కార్మిక విభాగం అధ్యక్షుడు మేడి పాండు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి వరదయ్య, రిటైర్డ్ హౌజింగ్ ఇంజనీర్ చింత నారాయణ గౌడ్,టీ ఎస్ ఎస్ ఎ విద్యార్థినులు లక్ష్మి, రజని, అలాగే రమేష్, నరేష్, వెంకటేష్, అదురి అజయ్ ఆళ్ళ చందు,తదితరులు పాల్గొని విజయవంతం చేశారు

# రాజకీయాలను దిగజారుస్తున్న బజారు భాష

## సమస్యల మళ్లింపుకే ఆస్తుల ఆరోపణలు

## ప్రజల పాత్ర లేని దిశగా ప్రజాస్వామ్యం

## ఐక్య కార్యాచరణ తర్వాతే ఐక్యత

## -ఐజెయు మీట్ ద ప్రెస్లో సిపిఎం నేత తమ్మినేని

ఖమ్మం, నీలగిరి వార్త ప్రతినిధి అక్టోబర్ 5:

రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు వాడుతున్న బజారు భాష రాష్ట్ర రాజకీయాలను దిగజారుస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం తెలిపారు. గౌరవనీయ భాష ప్రయోగించకుండా నీచ పదజాలం రాజకీయాల్లో సరైంది కాదని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించుకే భూ కబ్జాలు, ఆక్రమణల వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం టియుడబ్ల్యూజె (ఐజేయు) ఆధ్వర్యంలో తమ్మినేనితో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించగా టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ నేతల భాష ఆక్షేపణీయమని ఈ భాష సరైంది కాదన్నారు. విమర్శించడానికి ఈ పద్ధతి తగదని ఆయన కాంగ్రెస్, బిఆర్ఎస్లకు సూచించారు. రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య భూ ఆక్రమణలు, అక్రమ సంపాదనలకు సంబంధించి పరస్పర విమర్శల పర్వం సాగుతుందని కేవలం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికే పథకం ప్రకారం రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. పాపాలు చేయడంలో రెండు పార్టీలు సమానమేనని రేవంత్రెడ్డి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలకు సంబంధించి బిఆర్ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం అవుతుండగా అధికారం చేతిలో ఉన్న కాంగ్రెస్ కూడా కేవలం ఆరోపణలు మాత్రమే చేస్తుందని ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కాంగ్రెస్ భూ ఆక్రమణలపై బిఆర్ఎస్ కార్యాచరణ చేపట్టదని బిఆర్ఎస్ భూ ఆక్రమణలపై అధికార పార్టీ చర్యలకు పూనుకోదని ఈ విషయం ప్రజలకు కూడా తెలుసునన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకేందుకని తమ్మినేని ప్రశ్నించారు. హామీలు అమలు పరచలేని కాంగ్రెస్ వల్ల కార్యాచరణ లేని బిఆర్ఎస్ వల్ల ఈ రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే



భారతదేశంలో ప్రజల పాత్ర క్రమేపి తగ్గిపోతుందన్నారు. ఒకప్పుడు రిగ్గింగులు, ఓట్ల కొనుగోలు, ఇప్పుడు గెలిచిన అభ్యర్థులను కొనుగోలు చేయడం ఏకంగా ఓటింగ్ మిషన్ల ద్వారా ఓట్లను సానుకూలంగా వేయించుకునే పద్ధతికి తెరలేపారన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో బిజెపి 2024లోనే సఫలీకృతమైనట్లు అనేక సర్వేలు చెబుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం పాలన సాగడం లేదని ప్రజల విమర్శకు కనీసం సమాధానం చెప్పే స్థితిలో కేంద్ర ప్రభుత్వం లేదన్నారు. ఎవరైనా విమర్శిస్తే దేశ ద్రోహులుగా ముద్రిస్తున్నారని తమ్మినేని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఎంపికే తప్పని పద్ధతి ప్రకారం జరగని ఎన్నికల కమిషన్ ఎంపికతో అధికారానికి ఎన్నికల కమిషనర్ దాసోహం అన్నారని ఆయన తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని తమ్మినేని స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు పెత్తనం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆ క్రమంలోనే దిమాగినక్సల్స్ పదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. నక్సల్స్ పేరుతో అడవుల్లోని సాయుధులను హతమార్చినట్లు ఆలోచించగలిగి సమాజం కోసం పనిచేసే వారిని దిమాగి నక్సల్స్ పేరుతో హతమారుస్తారా అని తమ్మినేని ప్రశ్నించారు. బిజెపి గ్రాఫ్ పడిపోతుందని 2014లో సంక్షేమం, ఆర్థిక ప్రణాళికతో ముందుకు వచ్చిన బిజెపి 2024 నాటికి మతాన్ని ఎజెండాగా చేసిందని బిజెపి కేవలం టిడిపి, ఇతర మిత్ర పక్షాల మద్దతుతోనే అధికారంలోకి రాగలిగిందన్నారు. అమెరికాకు మోడీ దాసోహం అంటుండగా అమెరికాలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొందని అక్కడి ప్రజలు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారని తమ్మినేని తెలిపారు. భారతదేశంలో అవినీతి వ్యవస్థీకృతమవుతుందని ఆయన తెలిపారు. వ్యవస్థీకృతమైన అవినీతి పేద, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టాన్ని, కష్టాలను తెచ్చిపెడుతుందన్నారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పక్కదారి పట్టించేందుకే విపక్షంపై ఆరోపణలు చేసి రాద్ధాంతం చేస్తుందని చివరకు ఏమి తేల్చలేని స్థితికి దిగజారుతుందన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చే స్థితిలో ఈ ప్రభుత్వం లేదన్నారు. బిఆర్ఎస్ కూడా ప్రకటనలకే పరిమితం అవుతుంది తప్ప కార్యాచరణ ప్రకటించడం లేదన్నారు. రాష్ట్రంలో మూడో ఫ్రంట్కు అవకాశం లేదని తమ్మినేని తెలిపారు. కమ్యూనిస్టుల సమీకరణ శక్తి తగ్గుతుందన్న ప్రశ్నకు తమ్మినేని సమాధానం ఇస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవహారాల్లో వచ్చిన మార్పులు కొంత కారణమని కానీ ప్రజల సమస్యలపై నిరంతర ఆందోళనలు చేస్తూనే ఉన్నామన్నారు. ఎన్నికల ఫలితాలపై తమ్మినేని మాట్లాడుతూ బలమైన ఎజెండాతో ఎన్నికల్లోకి వెళ్తున్న బూర్జువా పార్టీల ఆర్థిక, వ్యవహారాలు ఎన్నికల సంఘం వ్యవహార శైలితో ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోతు న్నామన్నారు. కాంగ్రెస్తో 2024లో పొత్తు చెడిపోవడానికి పాలేరు కారణం కాదని తమ్మినేని స్పష్టం చేశారు. రెండు పార్టీల మధ్య సరైన అవగాహన లేదని కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను కదిలించడం ద్వారా ప్రజా ఉద్యమ నిర్మాణానికి సిపిఎం ప్రాధాన్యతనిస్తుందన్నారు. వామపక్షాల ఐక్యత గురించి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఐక్య కార్యాచరణ లేకుండా ఐక్యత సాధ్యం కాదని సిపిఐ, సిపిఎంల మధ్య పార్టీ కార్యక్రమంలోనే తేడా ఉందని దాని సరిచేసుకుంటేనే ఐక్యత సాధ్యమవుతుందన్నారు. విలీనానికి సిపిఎం వ్యతిరేకం కాదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార కాంక్షతో వ్యవహరిస్తుందని ఇండియా కూటమిలో ఉన్న పార్టీలను సైతం ఓడించేందుకు ప్రయత్నిస్తుందని అదే విషయం కేరళలో స్పష్టమైందన్నారు. జన్జ ఉద్యమం అంతకు ముందు రైతు ఉద్యమం ఈ దేశంలో ఇటీవల కాలంలో అపూర్వ విజయాలు సాధించాయని రైతు ఉద్యమం నల్ల చట్టాలను రద్దు చేయించగలిగితే జనీ ధర్మేంద్ర ప్రధాన న్ను రాజీనామా చేయించిందని ఇప్పుడు ఎన్నికల కమిషనర్ కూడా రాజీనామా చేయాలని లేని పక్షంలో జన్జీతో పాటు వామపక్షాలు, కలిసి వచ్చే శక్తులను కలుపుకుని ఉద్యమిస్తాయన్నారు. జనీ డిమాండ్లు కమ్యూనిస్టుల డిమాండ్లనని ఆయన తెలిపారు. సిపిఎం నాయకుని హత్యకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి నియోజక వర్గంలో జరిగినప్పుడు ఎవరు హత్య చేశారో తేల్చాల్సిన బాధ్యత ఆయనకే ఉందని హంతకులను అరెస్టు చేయండి అంటూ ఇప్పటికే సిపిఎం పలు ఆందోళనలు చేపట్టిందని ఒక ప్రశ్నకు సమాధానంగా తమ్మినేని తెలిపారు. ఒకరిద్దరు వ్యక్తుల వ్యక్తిగత వ్యవహారశైలి కారణంగానే ఏదులాపురం మున్సిపాలిటీలో ఒక స్థానం ఏకగ్రీవమైందని అది పార్టీ నిర్ణయం కాదన్నారు. ఖమ్మం జర్నలిస్టులు తమ్మినేనిని శాలువతో సత్కరించారు.

# సింగరేణి భవన్ ముట్టడికి వెళ్లిన టిఆర్ఎస్ శ్రేణులు..

**శేరిలింగంపల్లి నీలగిరి వార్త :**

తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సింగరేణి భవన్ ముట్టడి కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వాసిలీ చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి బారీగా తరలి వెళ్లారు. కార్మికుల తరుపున టిఆర్ఎస్ పార్టీ చేసిన నిరసన వల్ల సింగరేణి యాజమాన్యం దిగివచ్చి చర్చలు జరిపి, రెండు నెలలలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.




# బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన గుండె గణేష్ ముదిరాజ్

**మక్తా మహబూబ్‌పేట్ నీలగిరి వార్త:**

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మక్తా మహబూబ్‌పేట్ డివిజన్ 241 పరిధిలోని పెద్దకుడి చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను బిజెపి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ముదిరాజ్ , సి ఎం సి విభాగం ఏ ఇ నిఖిల్ మరియు సంబంధిత శాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకునేలా పారిశుద్ధ్యం, లైటింగ్, నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని అధికారులకు సూచించారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుండె గణేష్ ముదిరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జాజేరావు రమేష్, చిన్న, భవానీ శంకర్, కొంచ యాదయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఓబీసీ సింహగర్జన





**శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లిన బీసీ సంఘాల నేతలు..**

**ఓబీసీ సింహగర్జనను విజయవంతం చేసిన బీసీ సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్..**

**శేరిలింగంపల్లి నీలగిరి వార్త ..**

ఓబీసీ సింహగర్జన' మహాసభ పీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ సింహగర్జన విజయవంతం అయ్యింది. శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి వెళ్ళి ఓబీసీ సింహగర్జనను విజయవంతం చేసిన ప్రతి బీసీ సంఘాల నాయకులకు ధన్యవాదాలు తెలిపిన బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్. మన దేశంలో సామాజిక సమతుల్యతను, బహుజనుల హక్కులను కాపాడటమే లక్ష్యంగా అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు, రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలం గొల్లపల్లిలో ప్రతిష్టాత్మకంగా 'ఓబీసీ సింహగర్జన' మహాసభ పీసీసీ ఓబీసీ ఛైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ఓబీసీల హక్కుల కోసం, రాజ్యాంగబద్ధమైన పదవులలో తగిన రిజర్వేషన్ల సాధన కోసం, "జిస్కి జిత్ని సంఖ్య – ఉత్ని హిస్సేదారి" (ఎవరి సంఖ్య ఎంతైతే, అంత వాటా) అనే నినాదాన్ని సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక న్యాయం మన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం, ఓబీసీ సోదరులు, యువకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి, శంషాబాద్ గడ్డపై జరిగిన ఈ 'ఓబీసీ సింహగర్జన' సభ ను ఘన విజయం చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఓబీసీ హక్కుల కోసం ఐక్యతను చాటి పెద్ద ఎత్తున తరలివచ్చి సింహ గర్జన సభను విజయవంతం చేసిన వారందరికీ నమస్కారాలు తెలియజేసిన భేరి రామచందర్ యాదవ్. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. బీసీలంతా ఏకమై పోరాటం చేద్దాం అని అన్నారు. పోరాడితే పోయేది బానిస సంకెళ్లు మన ఓబిసి హక్కులకై మన అందరం కలిసికట్టుగా ఐక్యమత్యంగా పోరాటం చేసి మన హక్కులు మనం సాధించుకోవాలని అన్నారు. సభకు ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ డా అనిల్, జైహింద్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐపీసీ ఛైర్మన్ మధు యాస్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత్ రావు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ మారబోయిన రఘునాథ్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్, ఏఐసీసీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రముఖ నాయకులు, మేదరి సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుంటూ నవీన్, తెలంగాణ రాష్ట్ర బిసి సంఘాల ఐక్య వేదిక జనరల్ సెక్రటరీ బండి రామకృష్ణ గౌడ్, అందెల కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రామప్పకు ముప్పు లేదని సింగరేణి స్పష్టం.

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి :**

ప్రపంచ వారసత్వ సంపద అయిన ప్రాచీన శిల్పకళ రామప్ప ఆలయ క్షేత్రానికి సింగరేణి మైనింగ్ తో ముప్పు పొంచి ఉందని వస్తున్న వార్తలు కేవలం అపోహలు, అవాస్తవాలు మాత్రమే అని సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ములుగు జిల్లా వెంకటాపూర్ లో సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టాలని తలపెట్టిన వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు విషయంలో సమగ్రంగా శాస్త్రీయ అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత పురావస్తు శాఖ, ఇతర ప్రతిష్టాత్మక సంస్థలు శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఇచ్చే నివేదికల ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొంది. బాధ్యతాయుతమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణి తెలంగాణకు చెందిన ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప గుడికి ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం చేకూర్చబోదని, వారసత్వ సంపద పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. పర్యావరణానికి ప్రాధాన్యత ఇస్తూ చట్టబద్ధమైన మైనింగ్ కార్యకలాపాలు చేయడంలో సింగరేణి ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.

# సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించాలి

**36% వాటా కార్మికులకు చెల్లించాలి**

**అభివృద్ధి పేరిట కోతలు లేకుండా ఇవ్వాలి.**

**ఆర్ జి 3 అన్ని గనుల్లో టీబీజీకేస్ శ్రేణుల వినతి పత్రం.**

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి**





కార్మికుని చెమటతో ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకొని అనారోగ్య సమస్యలను తెచ్చుకొని ప్రమాదాల సుడిగుండంలో పనిచేస్తూ బొగ్గును వెలికితీస్తూ కార్మికులు కంపెనీకి లాభాలను తీసుకువస్తున్నారని యాజమాన్యం గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీకి వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 36 శాతం లాభాల వాటాను కార్మికులకు చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సేంటినరీ కాలనీ ఆర్జీ 3 ఏపీఏ ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కేంద్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు డివిజన్లోని అన్ని గనులు మరియు డిపార్ట్మెంట్ల వద్ద మేనేజర్లకు ఇతర ఉన్నతాధికారులకు వినతి పత్రం అందించారు. శీషె 1 ఫిట్ సెక్రటరీ గీటుకు శ్రీనివాస్, ఓసి 2 బేస్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ చిప్ప సురేష్ , సిహెచ్పి పిట్ సెక్రటరీ బుద్దే ఉదయ్,ఏ ఎల్ పి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు పూసాలశేఖర్, గొర్రె క్రాంతి యాదవ్, కొప్పుల సురేష్, ఎస్ అండ్ పి సి పిట్ సెక్రెటరీ దేవరకొండ తిరుపతి ఓసి 1 బేస్ వర్క్ షాప్ పిట్ సెక్రటరీ భోగం పూర్ణాకర్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి, సెంట్రల్ జాయింట్ మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీలు దేవ శ్రీనివాస్, ఈసంపల్లి రమేష్, గట్టు శ్రీనివాస్, బోయినపల్లి శ్రీకాంత్ రావు, బ్రాంచ్ సెక్రటరీలు అల్లం తిరుపతి, దాసరి మల్లేష్, బోట్ల శివశంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా డివిజన్ పిట్ కమిటీ కమిటీ నాయకులు ఇతర కార్మికులతో కలిసి నాయకులు ఆయా గనుల మేనేజర్లకు హెచ్ఓడీలకు ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ వెళ్లి వినతి పత్రాలు సమర్పించారు.

**అభివృద్ధి నిధుల పేరిట కోతలు**

ఈ సందర్భంగా నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ 2022--23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి 2,222 కోట్లు లాభాలు గడించగా 32% శాతం లాభాలను కార్మికులకు చెల్లించారు టీబీజీకేఎస్ హయాంలో సంస్థ అభివృద్ధి కోసం ఎలాంటి నిధులను పక్కన పెట్టలేదన్నారు. ఏఐటియుసి -ఐ ఎన్ టి యు సి ల ప్రాతినిధ్యంలో 2023--24 ఆర్థిక సంవత్సరం సింగరేణి ?4,701.3 కోట్లు లాభాలు అర్జించగా లాభాల వాటా 33 శాతం అని ప్రకటించి సంస్థ అభివృద్ధి పేరిట ?2,289 కోట్లు ప్రక్కన పెడుతున్నామని కార్మికులకు మాత్రం 2412 కోట్లు మాత్రమే లాభాల వాటా పంపిణీ చేశారు ఇది 16.9% శాతం మాత్రవేచ్చాయని తెలుపుతూ సంస్థ అభివృద్ధి పేరిట ప్రక్కన పెట్టిన డబ్బులు ?4,034 కోట్లు ఇది లాభాల రు కంపెనీ కోసం కొత్త వాహనాలను సమకూర్చారో వెల్లడించాలన్నారాభాలలో 36% వాటా ఇలాంటి కోతలు లేకుండా కార్మికులకు దసరాకు వారం పది రోజుల ముందే పంపిణీ చేయాలని వినతి పత్రం ద్వారా అధికారులను కోరారు. ఆలస్యంఉన్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ టీబీజీకేఎస్ారు. ఈ కార్యక్రమంలో నాయకులు సెంట్రల్ జాయింట్ సెక్రటరీలు సుద్దాల తిరుపతి, కూతాటి వెంకటయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, రవీందర్, చుక్కల కుమార్, బండి బాబురావు ,మల్లేష్ సత్యనారాయణ, నరసయ్య, రవి ఏ ఎల్ పి నాయకులు మహేష్, వేదవ్యా స్ ,కిరణ్, సదన్ శ్రీనివాస్ ,ఆనంద్ ,మధు పటేల్ ,సందీప్ ,చిరంజీవి రాజేష్ ,వెంకటేష్ ,వెంకి ఓసి 2 నాయకులు

# ఇండియన్ రెడ్ క్రాస్ కామారెడ్డి జిల్లా చైర్మన్‌ను సన్మానించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

ఇండియన్ రెడ్ క్రాస్ కామారెడ్డి జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన ముక్కర సంజీవరెడ్డి ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సంజీవరెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తదానం, రక్త సేకరణతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముక్కర సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అత్యవసరంగా రక్తం అవసరమైన వారికి రక్తదానం అందించడంతో పాటు, ప్రజల అవసరాలకు అనుగుణంగా వివిధ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రజాసేవే లక్ష్యంగా రెడ్ క్రాస్ సంస్థను మరింత బలోపేతం చేసి, అవసరమైన ప్రతి ఒక్కరికీ అండగా నిలిచేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



# హిమాచల్ ప్రదేశ్‌లోని తరంగ్-2 పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థిని సన్మానించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

హిమాచల్ ప్రదేశ్‌లోని తరంగ్ 2 అతి ఎత్తైన 6,021 మీటర్ల పర్వతాన్ని అధిరోహించిన గిరిజన విద్యార్థిని బన్నీని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్. రాజంపేట మండలం ఎల్లాపూర్ తండాకు చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, కామారెడ్డిలో బీకాం తుది సంవత్సరం చదువుతున్న విశ్లావత్ బన్నీ హిమాచల్ ప్రదేశ్‌లోని 6,021 మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి చారిత్రాత్మక ఘట్టాన్ని నమోదు చేశారు.
ఈ సందర్భంగా జిల్లా సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థి విశ్లావత్ బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యతో పాటు సాహస క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు కూడా తమ ప్రతిభను వివిధ రంగాల్లో చాటాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఏకలవ్య పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్ గా నిలపాలి

## పాఠశాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

గాంధారి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల జిల్లా స్థాయి పాలక మండలి సమావేశంలో పాఠశాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలలోని సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి పాలక మండలి సభ్యులు వారానికి ఒకరు చొప్పున పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సూచించారు. పాఠశాలలో చేపడుతున్న ఇంజినీరింగ్ పనులను ఈ నెలలోనే పూర్తి చేస్తామని డీఈఈ సంపత్ కుమార్ కలెక్టర్‌కు వివరించారు. తదుపరి పాలక మండలి సమావేశాన్ని జనవరిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పి. చంద్రశేఖర్, ప్రాంతీయ సమన్వయ అధికారి గంగారాం నాయక్, జిల్లా సంక్షేమ అధికారి సౌజన్య, ప్రధానాచార్యులు శ్యామలదేవి, అమర్ సింగ్, మాధవరావు, రవీంద్ర కుమార్, సంతోష్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా అమ్మ హాస్పిటల్ ను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ









**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమ్మ హాస్పిటల్ ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ. జిల్లా కేంద్రంలో నూతన హాస్పిటల్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, నౌసిలాల్, అనంత్ రెడ్డి, సుతారి రమేష్, అనంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నౌసిలాల్, కృష్ణారావు, శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రాజగౌడ్, రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కౌన్సిలర్లు షేరు, సత్యం, అంజాద్, జావీద్, లడ్డు, సిద్దిక్, చిట్టిబాబు, గణేష్, గంగాధర్, మజీద్, కో ఆప్షన్ సభ్యులు ముబషీర్, అలీ బిన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు పండ్ల రాజు, వెంకట్ రావు, సుదర్శన్, వెంకటేష్, సలీం, భాస్కర్, నవీన్, ఘాజి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లా ప్రజావాణిలో 109 ఫిర్యాదులు





## స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 109 ఫిర్యాదులు, వినతులు అందాయి. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం సమగ్రంగా పరిశీలించి అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిశీలించి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వారి సమస్యలను సానుకూలంగా విని నిబంధనల పరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, డీఆర్ఓ పాండు, సీఈఓ చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పోషణ్ అభియాన్ - పోషణ్ మాసం కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన 'పోషణ్ మాసం' కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని, ప్రతి కుటుంబం సమతుల్య ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చైర్‌పర్సన్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైర్ పర్సన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం,పుట్టిన ఆడ పిల్లలకు బేబీ కిట్ లు,అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బాను ప్రకాష్, సిడిపిఓ సుజాత,ఇంచార్జ్ డిడబ్ల్యు ఓ ఆఫీసర్ వెంకటేష్,సూపర్ వెయిజర్ కవిత, అంగన్వాడీ ఉపాధ్యాయులు,గర్భిణీ స్త్రీలు,బాలింతలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నా పేరు వాడి నా జీవితానికి అన్యాయం చేయొద్దు



ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ సోషల్ మీడియా వేదికగా చేసిన ఓ తాజా పోస్టు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. తన పేరును అనవసరమైన ప్రచారాలకు, చర్చలకు ఉపయోగించవద్దంటూ ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితానికి ఇబ్బందులు కలిగించేలా తన పేరును ఉపయోగించొద్దని చేతులెత్తి వేడుకున్నారు. సోమవారం సోషల్ మీడియాలో స్పందించిన బండ్ల గణేశ్.. తనకు ఎలాంటి పదవులు, హోదాలపై ఆసక్తి లేదని స్పష్టం చేశారు. తన పేరు చుట్టూ జరుగుతున్న చర్చలు, ప్రచారాల వల్ల తాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆయన పోస్టు ద్వారా చెప్పుకొచ్చారు.దయచేసి మీ టైమ్‌పాస్ కోసం నా పేరు వాడి, నా జీవితానికి అన్యాయం చేయొద్దని చేతులెత్తి నమస్కరిస్తున్నాను అంటూ బండ్ల గణేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. తనకు ఎలాంటి పదవుల మీద కానీ, హోదాల మీద కానీ వ్యామోహం లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా మరే ఇతర విషయాలపైనా తనకు ఎలాంటి ఆశలు లేవని ఆయన తెలిపారు. లేనిపోని విషయాలు మాట్లాడి తన పేరును ఉపయోగించడంతో తనకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అలాంటి ప్రచారాలకు దూరంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరారు.అయితే బండ్ల గణేశ్ ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై మాత్రం స్పష్టత లేదు. ఆయన తన పోస్టులో ఎవరిపేరును ప్రస్తావించలేదు. దీంతో ఆయన తాజా వ్యాఖ్యల వెనుక అసలు కారణం ఏమిటనే దానిపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. తనకు పదవులు, హోదాలపై ఆసక్తి లేదని ప్రత్యేకంగా చెప్పడంతో.. ఆయన రాజకీయ లేదా ఇతర పదవులకు సంబంధించిన ప్రచారాలను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారా? అనే చర్చ కూడా జరుగుతోంది. అయితే దీనిపై బండ్ల గణేశ్ ఎలాంటి వివరణ ఇవ్వలేదు. సాధారణంగా సోషల్ మీడియాలో తనదైన శైలిలో స్పందించే బండ్ల గణేశ్.. ఈసారి మాత్రం చాలా భావోద్వేగంగా తన అభ్యర్థనను వెల్లడించడం గమనార్హం. "నా జీవితానికి అన్యాయం చేయొద్దు" అంటూ ఆయన చేసిన విజ్ఞప్తి ప్రస్తుతం నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది.

## మళ్లీ వాయిదా పడిన 'ఆదర్శ కుటుంబం'.. అసలు కారణం ఇదే, కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడంటే?




విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం' మరోసారి వాయిదా పడింది. కొంతకాలంగా ఈ సినిమా విడుదలపై సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండగా.. తాజాగా నిర్మాత నాగవంశీ అధికారికంగా స్పందించి వాయిదా విషయాన్ని వెల్లడించారు. దీంతో ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే ఆసక్తి నెలకొంది. 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా వేయడానికి ప్రధాన కారణం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడమేనని నిర్మాత నాగవంశీ తెలిపారు. కొన్ని సాంకేతిక పనులు మరో నాలుగైదు రోజులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో అనుకున్న సమయానికి సినిమాను విడుదల చేయడం కంటే.. పూర్తి నాణ్యతతో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే మంచిదని చిత్రబృందం నిర్ణయించినట్లు చెప్పారు.సినిమా అవుట్‌పుట్‌పై టీమ్ పూర్తిగా సంతృప్తి చెందిన తర్వాతే దాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నామని నాగవంశీ వెల్లడించారు. సినిమా కాపీ చూసిన తర్వాత టీమ్ అంతా సంతృప్తిగా ఉందని భావించినప్పుడే విడుదల చేస్తామని, అందుకోసం కొంత సమయం తీసుకోవడం తప్పేమీ కాదని పేర్కొన్నారు. వెంకటేశ్--త్రివిక్రమ్ కాంబినేషన్‌పై భారీ అంచనాలు ఉండటంతో 'ఆదర్శ కుటుంబం' విడుదల తేదీపై మొదటి నుంచీ ఆసక్తి నెలకొంది. తొలుత ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రకటించారు. అయితే ఆ తేదీ నుంచి అక్టోబర్ 9కి వాయిదా వేశారు. ఇప్పుడు మరోసారి విడుదల వాయిదా పడింది.కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాత నాగవంశీ తెలిపారు. దీంతో ఈ సినిమా అక్టోబర్‌లోనే వస్తుందా? లేక మరింత ముందుకు వెళ్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రమిది కావడంతో 'ఆదర్శ కుటుంబం'పై అభిమానుల్లో మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి స్పందన రావడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాలో వెంకటేశ్ చిట్టిబాబు అనే మధ్యతరగతి వ్యక్తి పాత్రలో కనిపించనున్నారు. ఆయన భార్యగా శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. నివేదా పేతురాజ్, నారా రోహిత్, రావు రమేశ్, రఘుబాబు, సత్య తదితరులు కీలక పాత్రల్లో నటించారు. నారా రోహిత్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## బాలయ్యకు విలన్‌గా రాజశేఖర్? ... కొరటాల శివ సినిమాలో కీలక పాత్రపై ఆసక్తికర టాక్



నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు, కొరటాల శివ మార్క్ కథా కథనాలు, సామాజిక అంశాలు తోడైతే సినిమా ఏ స్థాయిలో ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇందులో బాలకృష్ణను ఢీకొట్టే ప్రధాన ప్రతినాయకుడి పాత్ర కోసం సీనియర్ హీరో డాక్టర్ రాజశేఖర్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు ఫిలింనగర్‌లో టాక్ వినిపిస్తోంది.యాక్షన్ సినిమాలతో పాటు విభిన్నమైన పాత్రల్లో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్.. ఈ సినిమాలో ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. కొరటాల శివ రూపొందిస్తున్న కథలో ఈ విలన్ పాత్రకు మంచి ప్రాధాన్యత ఉందని, బలమైన వ్యక్తిత్వంతో పాటు ఇంటెన్స్ సన్నివేశాలు, పదునైన డైలాగులు ఉంటాయని టాక్. బాలకృష్ణ లాంటి మాస్ హీరోకు ఎదురుగా అదే స్థాయిలో స్క్రీన్ ప్రెజెన్స్ ఉన్న నటుడు ఉంటే సినిమాకు మరింత బలం చేకూరుతుందని దర్శకుడు భావించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే రాజశేఖర్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది.ఈ ప్రచారం ప్రకారం.. కొరటాల శివ స్వయంగా రాజశేఖర్‌ను కలిసి కథతో పాటు ఆయన పాత్ర తీరుతెన్నులను వివరించినట్లు సమాచారం. ముఖ్యంగా విలన్ పాత్రలోని వైవిధ్యం, కథలో దానికి ఉన్న ప్రాధాన్యత రాజశేఖర్‌కు నచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.ఒకవేళ రాజశేఖర్ ఈ ప్రాజెక్టులో భాగమైతే మాత్రం బాలకృష్ణ, రాజశేఖర్ మధ్య వచ్చే సన్నివేశాలపై భారీ అంచనాలు ఏర్పడే అవకాశం ఉంది. ఇద్దరు సీనియర్ నటులు ఒకే తెరపై ప్రత్యర్థులుగా కనిపించడం అభిమానులకు కొత్త అనుభూతిని అందించే అంశంగా మారొచ్చు. మరోవైపు ఈ సినిమాలో బాలకృష్ణ తండ్రీకొడుకులుగా రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. కొరటాల శివ శైలికి తగ్గట్టుగా సామాజిక అంశాన్ని కుటుంబ భావోద్వేగాలతో ముడిపెట్టి కథను రూపొందిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి భారీ యాక్షన్ ఎపిసోడ్స్ కూడా జోడించనున్నారని సమాచారం.

## సూరి సినిమాకు సుహాస్ విలనిజం.. రూ.150 కోట్ల బ్లాక్‌బస్టర్ 'మండాడి' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్




తమిళ నటుడు సూరి, టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో తెరకెక్కిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి' థియేటర్లలో సంచలన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. మతిమారన్ పుగళేంది దర్శకత్వం వహించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి ఏకంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు రాబట్టినట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్ సినిమా ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. 'మండాడి' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 8, 2026 నుంచి 'మండాడి' స్ట్రీమింగ్ కానుంది. తొలుత అక్టోబర్ 9న ఓటీటీలోకి వస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ఆ తేదీ కంటే ఒక రోజు ముందుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నెట్‌ఫ్లిక్స్ నిర్ణయించింది.తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లోనూ ఈ సినిమా అందుబాటులోకి రానుంది. దీంతో థియేటర్లలో సినిమా మిస్ అయిన ప్రేక్షకులతో పాటు, సుహాస్ విలనిజాన్ని ఓటీటీలో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు ఆడియన్స్‌కు కూడా ఇది గుడ్‌న్యూస్ అని చెప్పొచ్చు. కార్తీ హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'సర్దార్ 2' తో పోటీగా థియేటర్లలోకి వచ్చిన 'మండాడి' అనూహ్యంగా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటింది. గ్రామీణ నేపథ్యంలో సాగే కథ, సంప్రదాయ పడవల పోటీ, స్పోర్ట్స్ అంశాలు, మైండ్ గేమ్స్, యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు మతిమారన్ పుగళేంది ఆసక్తికరంగా




తెరకెక్కించినట్లు ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది.ముఖ్యంగా సూరి పోషించిన పాత్రకు, కథలోని సంఘర్షణకు మంచి ఆదరణ లభించింది. పెద్ద సినిమాల మధ్య విడుదలైనప్పటికీ 'మండాడి' ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే కాకుండా భారీ వసూళ్లు సాధించడం ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ఈ సినిమాతో టాలీవుడ్ నటుడు సుహాస్ తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాడు. ఇప్పటివరకు తెలుగులో హీరోగా, వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుహాస్.. 'మండాడి'లో మాత్రం పూర్తిగా నెగెటివ్ షేడ్స్ ఉన్న కీలక పాత్రలో కనిపించాడు. సూరి, సుహాస్ మధ్య సాగే ఈగో వార్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా సుహాస్ తన పాత్రలో చూపించిన విలనిజం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తెలుగులో హీరోగా మెప్పిస్తున్న నటుడు తమిళంలో ఇంత నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించడం కూడా సినిమాపై ఆసక్తిని పెంచింది. థియేటర్లలో రూ.150 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన 'మండాడి' ఇప్పుడు ఓటీటీలోకి రాబోతుండటంతో సినిమాపై మరోసారి ఆసక్తి నెలకొంది. అక్టోబర్ 8 నుంచి తెలుగు సహా ఐదు భాషల్లో స్ట్రీమింగ్ కానున్న ఈ సినిమా ఓటీటీలో ఎలాంటి స్పందన అందుకుంటుందో చూడాలి.

## చిరంజీవి--బాలకృష్ణ మల్టీస్టారర్.. బోయపాటి శ్రీను కీలక వ్యాఖ్యలు

మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ కలిసి ఓ సినిమా చేస్తే ఎలా ఉంటుంది? ఈ కాంబినేషన్ గురించి ఎప్పటి నుంచో అభిమానుల్లో ఆసక్తి ఉంది. అయితే గతంలో బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రయాణం వేడుకల సందర్భంగా చిరంజీవి స్వయంగా దర్శకుడు బోయపాటి శ్రీనుకు ఓ సవాల్ విసరడంతో ఈ కలయికపై ఒక్కసారిగా చర్చ మొదలైంది. చిరంజీవి, బాలకృష్ణతో కలిసి ఓ సినిమా చేయాలని బోయపాటిని కోరడంతో.. ఈ మల్టీస్టారర్ ఎప్పుడు కార్యరూపం దాలుస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బోయపాటి శ్రీను.. ఈ ప్రతిష్టాత్మక కాంబినేషన్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చిరంజీవి, బాలకృష్ణలను కలిపి సినిమా చేయాలనే ఆలోచన కచ్చితంగా కార్యరూపం దాల్చాల్సిన విషయమేనని ఆయన అభిప్రాయపడ్డారు.



## దర్శకుడిగా కిరణ్ అబ్బవరం తొలి సినిమా.. 'ఇంట్రెస్టింగ్ టైటిల్ ఫిక్స్




యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం మరో ఆసక్తికరమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కిరణ్.. ఇప్పుడు దర్శకుడిగా కూడా కొత్త బాధ్యతలు చేపట్టాడు. ఆయన దర్శకతచేసిన చిత్రబృందం.. సినిమాను క్రిస్మస్ కానుకగా 2026 డిసెంబర్ 25న థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. కిరణ్ అబ్బవరం ఇప్పటివరకు హీరోగా పలు సినిమాలు చేస్తూ వచ్చాడు. అయితే 'రియాలిటీ'తో తొలిసారి మెగాఫోన్ పట్టుకుని దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టాడు. హీరోగా నటిస్తూనే సినిమాను డైరెక్ట్ చేయడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారింది.




## ఆదాయపు పన్ను సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ క్లారిటీ.. వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదు

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ పేరు ఇటీవల వార్తలలో తెగ నిలుస్తుంది. ఆదాయపు పన్ను శాఖ సోదాలకు సంబంధించి కూడా రకుల్ హాట్ టాపిక్‌గా మారింది. అయితే తనపై వస్తున్న వార్తలపై రకుల్ స్పందిస్తూ.. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఆ సోదాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు అని రకుల్ ప్రీత్ సింగ్ స్పష్టం చేసింది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా తన పేరును ఈ వ్యవహారంతో ముడిపెట్టి వార్తలు ప్రచురించారని ఆది. చట్టబద్ధంగా తన ఆర్థిక వ్యవహారాలను నిర్వహిస్తున్నానని ఆమె చెప్పింది. అంతేకాకుండా అక్రమ విదేశీ నగదు బదిలీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని రకుల్ స్పష్టం చేసింది. వ్యక్తిగతంగా కానీ, ఏదైనా నిర్మాణ సంస్థ తరపున కానీ ఇలాంటి అక్రమ లావాదేవీల్లో తాను పాల్గొనలేదని వెల్లడించింది. భారత్‌లో కానీ, విదేశాల్లో కానీ మరెవరిపేరుతోనైనా బినామీ ఆస్తులు కలిగి ఉన్నానన్న ప్రచారాన్ని కూడా ఆమె ఖండించింది. తనపై వచ్చిన వార్తలను "తప్పుడు, దురుద్దేశపూరితమైన, ఊహాజనిత కథనాలు"గా రకుల్ అభివర్ణించింది. ఇలాంటి వార్తలను ప్రచురించిన వారు వాటిని ఉపసంహరించుకుని వాస్తవాలను స్పష్టం చేయాలని ఆమె కోరింది.మీడియా సంస్థల వాణిజ్య ప్రయోజనాల కోసం వాస్తవాలను పక్కన పెట్టకూడదని రకుల్ పేర్కొంది. వార్తల కోసం, వాణిజ్య ఒత్తిళ్లు, ఒక వ్యక్తి ప్రతిష్ఠ, వాస్తవాలు, జీవనోపాధిపై ప్రభావం చూపే స్థాయికి వెళ్లకూడదని ఆమె సూచించింది. తనపై వస్తున్న ప్రచారానికి సంబంధించి రాకుల్ ప్రీత్ సింగ్ ఇలా తన వాదనను బహిరంగంగా వెల్లడించడంతో.. ఈ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని ఆమె స్పష్టం చేసినట్లయింది.



Printed, Published and Owned by GUNTOJ VISHNU MURTHY, Printed at V.M. PRINTERS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana. Published at V.M. PUBLICATIONS Plot No. 08, Shiva Shankar Colony, Kuntloor, (V) Abdulpurmet (M), Ranga Reddy District, Telangana State. Pin:501505, Editor, GUNTOJ VISHNU MURTHY, RNI NO: APTEL/31957/2009:Cell No: 9676549223.